క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



ఆత్మకూర్: పట్టణంలోని సమ్మిళిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంధ వృద్ధులకు, విద్యార్థులకు అన్నదానం చేశారు. అమరచింత మండలంలోని కిష్టంపల్లికి చెందిన నూక వెంకటడ్డి, తిప్పమ్మ మనువడు నూక మౌర్యన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. అలాగే ఫౌండేషన్‌కు 25 కేజీల బియ్యం, 5 కేజీల పప్పు, కూరగాయల కోసం రూ.2 వేల నగదు అందించినట్లు ఫౌండేషన్ డైరెక్టర్ గాండ్ల శివకుమార్ తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వనపర్తి రూరల్: ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు పలువురికి బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. శుక్రవారం పెబ్బేరు మండలంలోని సూగూరు గ్రామానికి చెందిన లచ్చమ్మకు రూ.10వేలు, పెబ్బేరుకు చెందిన బాలీశ్వరమ్మ రూ.33వేల చెక్కులను బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, రణధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన

వనపర్తి రూరల్: శ్రీ రంగాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం టీచర్ మంజులరాణి భవన్‌సాగర్‌కు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు తాగించాలని సూచించారు. జయసుధ, మనీషా పాల్గొన్నారు.

వీపనగండ్ల : మండలకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీచర్లు సుగుణాబాయి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి గొర్రెలు మృత్యువాత



వనపర్తి రూరల్: విద్యుత్ తీగలు తగిలి గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం..శుక్రవారం మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన గుండెల రాములు, పకీరయ్యలకు చెందిన గొర్రెల మంద మేతకు కోసం నాచహల్లి శివారులో పొలంలో మేత మేస్తుండగా ప్రమాదవశాత్తు తెగిపడిన విద్యుత్ తీగలకు తగిలి మూడు గొర్రెలు మృతి చెందాయన్నారు.

హామీలు అమలుపర్చాలి

ఆత్మకూర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేలను అమలుపర్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జ్ జంగయ్య మాదిగ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని బాబుజగ్జీవన్‌రాం విగ్రహంవద్ద ఎంఆర్‌పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు సమావేశమయ్యారు. చేయూత పెన్షన్ల పెంపు, ఎస్సీ, ఎస్టీఅట్రాసిటీ యాక్ట్ పునరుద్ధరణ తదితర సమస్యల పరిష్కారానికి ఆగస్టు 13న హైదరాబాద్‌లో మహాగర్జన నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు అజ్జపాగలక్ష్మణ్, మండల అధ్యక్షుడు దండుశ్రీను, నాయకులు చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రేపు బీజేపీ బైక్‌ర్యాలీ

వనపర్తి రూరల్: ఈ నెల 27న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు పెబ్బేరు పట్టణానికి వస్తున్న సందర్భంగా భారీ బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నామని రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు గొనివేమారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పెబ్బేరు పట్టణంలో మాట్లాడుతూ.. ర్యాలీలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, మండల, పట్టణ అధ్యక్షుడు నాగరాజుయాదవ్, క్రాంతి పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఖిల్లాఘనపురం: బైక్ ఢీ కొని గుర్తుతెలియని వ్యక్తికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి షాపురం స్టేజి సమీపంలో చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని మల్కాపురం గ్రామానికి చెందిన బీసం రాఘవేందర్‌రెడ్డి గురువారం రాత్రి 9గంటల సమయంలో ఖిల్లాఘనపురం నుంచి మల్కాపురం వెళ్తున్నాడు. షాపురం స్టేజి సమీపంలో బైక్ అదుపు తప్పి రోడ్డుపై వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొట్టాడు. దీంతో వ్యక్తి తీవ్ర గాయాలు కావడంతో రోడ్డుపై వెళ్తున్న కొందరు వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్సై సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన వ్యక్తి ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె.నరేశ్ తెలిపారు.

అరకొరగా టీచర్లు..



టీచర్ల కొరతను ఎదుర్కొంటున్నా బాలికల ఉన్నత పాఠశాల

- విద్యాశాఖ అధికారుల వివక్ష
- రిలీవర్ రాకుండానే బదిలీలు
- రెండేళ్లుగా బోధనకు దూరం

వీపనగండ్ల: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాలని ఆర్భాటంగా చెప్పుకొనే ప్రభుత్వం సబ్జెక్టుల వారిగా నియమించాల్సిన ఉపాధ్యాయ పోస్టులపై జిల్లా విద్యాధికారులు వివక్ష చూపుతుండడంతో సరైన బోధన జరగడం లేదు. మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో 145 మంది విద్యార్థులు ఉండగా రెండేళ్లుగా సరైన టీచర్లు లేక విద్యకు దూరమవుతున్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అవసరమైన టీచర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రిలీవర్ రాకున్న ఉపాధ్యాయుల బదిలీలు

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుడిని జిల్లా విద్యాధికారుల ఒత్తిడి మేరకు ప్రత్యామ్నాయ టీచర్ రాకుండానే రిలీవ్ చేసి జిల్లా కేంద్రానికి పంపించారు. గత యేడాది ఇదే పాఠశాలలో అనారోగ్యంతో సాంఘిక టీచర్‌ను కూడా జిల్లా కేంద్రానికే పంపించారు. దీంతో విద్యను అభ్యసిస్తున్న 116 మందికి ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుడు లేకుండా పోయాడు.

రెండేళ్లుగా టీచర్ల కొరత

మండలకేంద్రం బాలికల ఉన్నత పాఠశాలలో 29 మంది బాలికలు ఉండగా గత రెండేళ్లుగా ఇంగ్లిష్, హిందీ, తెలుగు, గణితం సబ్జెక్టులను బోధించే టీచర్లు లేకపోవడంతో ఒకే ఆవరణలో ఉన్న బాలుర పాఠశాలలకు వెళ్లి విద్యార్థులు పాఠాలు వింటున్నారు. రెండు పాఠశాలలకు ఇంగ్లిష్ బోధిస్తున్న టీచర్‌ను ఉన్నఫలంగా బదిలీ చేయడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

హామీ మరిచిన జిల్లా విద్యాధికారి

ఉన్న ఇంగ్లిష్ టీచర్‌ను బదిలీ చేయగా విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామంలోని వివిధ ప్రజాసంఘాల నాయకులు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడిని తిరిగి పాఠశాలకు రప్పించాలని జిల్లా, మండలస్థాయిలో నిరసన కార్యక్రమాలను చేపట్టారు. దీంతో రాజకీయకోణంలో ఆలోచించిన కొందరు ప్రజా సంఘాల నాయకులపై బైండోవర్ కేసులను నమోదు చేయించారు. ఈ విషయాల్ని పూర్తి స్థాయిలో తెలుసుకునేందుకు వచ్చిన డీఈఓ అబ్దుల్‌ఘని విద్యార్థులు నష్టపోకుండా వెంటనే ఉపాధ్యాయుడిని నియమిస్తామని హామీ ఇచ్చారు. కాని 20రోజులు గడిచినా నేటికీ నియమించలేదు. ఇప్పటికైనా మంత్రి జూపల్లి కృష్ణారావు కలగజేసుకొని ఇంగ్లిష్ టీచర్‌ను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల సంఖ్య తగ్గితే స్కూల్‌ను తీసేస్తారా..



బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినీల సంఖ్య తక్కువగా ఉందని పాఠశాల తీసేస్తామని అంటున్నారు. సరైన ఉపాధ్యాయులను నియమించకపోతే బాలికలు చదువుకునేందుకు ఎలా వస్తారు. విద్యాధికారులకు విషయం వివరించిన పట్టించుకోవడం లేదు.

– ఎ చందన, 10వ తరగతి, బాలికల ఉన్నత పాఠశాల, వీపనగండ్ల

పరీక్షలు ఎలా రాస్తాం



సాంఘికం, ఇంగ్లీష్ టీచర్ లేక తమకు పాఠాలు చెప్పకుంటే పరీక్షలు ఎలా రాయాలి. మంత్రి జూపల్లి విద్యార్థులపై కనికరం చూపి అన్ని సబ్జెక్టులను టీచర్‌ను పంపించండి.

– వై చందు, 9వ తరగతి, బాలుర ఉన్నత పాఠశాల, వీపనగండ్ల

పూర్తిస్థాయి టీచర్లుంటేనే మంచి ఫలితాలు



అవసరమైన మేరకు టీచర్లు ఉంటేనే పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించగలుగుతాం. ఉపాధ్యాయుల కొరతపై జిల్లాస్థాయి అధికారులకు విన్నవించాం. సత్వరంగా చర్యలు తీసుకోవాలని టీచర్ల కొరత లేకుండా చూడాలి.

– భానుప్రకాష్, జీహెచ్‌ఎం, బాలుర ఉన్నత పాఠశాల, వీపనగండ్ల

బట్టీ చదువులకు స్వస్తి పలకాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



విద్యార్థులకు షూ, టై బెల్టులు అందజేస్తున్న కలెక్టర్, ఎస్పీ

మదనాపురం: చదువులో విద్యార్థులు మెళకువలు నేర్చుకోవాలని కలెక్టర్ ఆదర్శ సురభి సూచించారు. శుక్రవారం మండలంలోని కొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సయ్యద్‌గూడ్సా విద్యార్థులకు ఉచితంగా బూట్లు, టై, బెల్ట్ పంపిణీ చేసే కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమానికి కలెక్టర్, ఎస్పీ గిరిధర్‌రావు వాటిని పంపిణీ చేసి దాతను అభినందించారు. పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోవడంతో మహేష్ అనే స్థానిక యువకుడు వ్యాయామ శిక్షణ ఇస్తుండడంతో అతన్ని కూడా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో గొప్ప సదుపాయాలు ఉన్నాయని, పాఠశాల చాలా బాగుందని అభినందించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారికి గణితంలో పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. అంతకుముందు కంప్యూటర్ గదిని కలెక్టర్ సందర్శించారు. ఎస్పీ గిరిధర్‌రావు మాట్లాడుతూ గ్రామానికి చెందిన గుడ్సా, మహేష్ పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేయడం అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులు కూడా దాతలు చేస్తున్న సహకారాన్ని గుర్తుపెట్టుకొని భవిష్యత్తులో తాము కూడా ఇతరులకు సహాయం చేయాల్సిన సమయం వచ్చినప్పుడు తప్పనిసరిగా ముందుండాలని చెప్పారు. విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేసిన దాతను ఎస్పీ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ అబ్దుల్‌ఘని, తహసీల్దార్ మోహన్, ఎంపీడీఓ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యవివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

వనపర్తి: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునే రోగుల వైద్య వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. జిల్లాలో క్షయ, మధుమేహం తదితర వ్యాధులతో బాధపడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించుకునే రోగులకు సంబంధించిన పూర్తి వైద్య వివరాలు ఆన్‌లైన్‌లో పొందు పర్చేందుకు కలెక్టర్ ప్రత్యేక చొరవతో వనపర్తి మెడికల్ హెల్త్ యాప్ ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌ను తయారు చేయించారు. ఈ పోర్టల్‌పై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వైద్య, ప్రాథమిక వైద్య అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి హెల్త్ ప్రొఫైల్ నమోదుపై అవగాహన కల్పించారు. ఈ పోర్టల్ ద్వారా వ్యాధిగ్రస్తుడికి భవిష్యత్‌లో వచ్చే రోగాలు, ఇంతకుముందు తీసుకున్న వైద్యవివరాలు అన్ని పరిశీలిస్తూ మెరుగైన వైద్యం పొందటానికి చాలా అవకాశం కలుగుతుందన్నారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వసతిగృహాల్లో రుచికరమైన భోజనం అందించాలి

వనపర్తి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో, వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం మాత్రమే వడ్డించాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపుహాల్లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్యతో కలిసి జిల్లాలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్స్, వసతి గృహాల వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం మాత్రమే వడ్డించాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉండొద్దని ఆదేశించారు. ప్రతిహాస్టల్లో భోజనాన్ని నాణ్యతను పరిశీలించేందుకు ఒక సూపర్‌వైజర్ ఉండాలని లేకపోతే నియామకం చేయాలని, ఈ బాధ్యత ఆయా రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్స్ పైనే ఉందన్నారు. అదేవిధంగా మెస్ కమిటీలు ఉండాలని, తప్పనిసరిగా కమిటీలకు చెందిన విద్యార్థుల సంతకాలు స్టాక్ రిజిస్టర్‌లో ఉండాలన్నారు. ఎక్కడైనా ఫుడ్ పాయిజన్ కేసులు నమోదు అయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో సిక్ రూమ్ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్న నేపథ్యంలో అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రత వాతావరణం కల్పించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈఓ అబ్దుల్‌ఘని, డీఆర్‌డీవో పీడీ ఉమాదేవి, వార్డెన్లు, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

వడబోసిన నీటినే తాగాలి



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో పాల్గొన్న కమిషనర్ శశిధర్



కల్వరాలలో సబ్ సెంటర్ పనులను పరిశీలిస్తున్న వంశీకృష్ణ

ఆత్మకూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కాచి వడబోసిన నీటినే తాగాలని తిప్డంపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఫయాజ్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం ఎస్సీ బాలికల హాస్టల్లో మెడికల్ క్యాంప్‌లో పాల్గొని విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరిత, ఆరోగ్య పర్యవేక్షకుడు సురేందర్‌గౌడ్, వార్డెన్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం:

పరిశుభ్రత అందరి బాధ్యతని దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా పురపాలికలో వార్డుల్లో సిబ్బందితో కలిసి పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు.

నాణ్యమైన భోజనం అందించాలి:

కేజీబీవీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని ఎంపీడీఓ శ్రీపాద్, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బాలకిష్టాపుర్‌లోని కేజీబీవీ పాఠశాలను అకస్మికంగా తనిఖీచేసి పరిసరాలను, వంటసామగ్రిని పరిశీలించారు, ఎస్ఓ స్వప్న, కార్యదర్శి హరిరాంసాగర్ ఉన్నారు.

పాన్‌గల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చునని ఎంపీడీఓ గోవింద్‌రావు, పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడేలో భాగంగా మండలంలోని అన్నారం గ్రామంలో వైద్యసిబ్బందితో కలిసి వారు పర్యటించారు. కార్యక్రమంలో వైద్యాధికారి మైథిలి, సూపర్‌వైజర్ శాంతమ్మ, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండండి

వీపనగండ్ల: ముసురు వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో పల్లెల్లో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య మానిటరింగ్ అధికారి వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం కల్వరాళ్ల గ్రామంలో నిర్మాణంలో ఉన్న హెల్త్ సబ్‌సెంటర్ పనులు ఆయన పరిశీలించారు. కలెక్టర్ ఆదేశానుసారం తూముకుంట, సంగినేనిపల్లి గ్రామాల్లో పర్యటించి వైద్య సిబ్బందికి తగుసూచనలు, సలహాలు ఇచ్చారు. మండల వైద్యాధికారి రాజశేఖర్, ఆశ కార్యకర్తలు ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పరిసరాల శుభ్రతలో ప్రజలు భాగస్వామ్యం అవ్వాలని ప్రమాదకరమైన వ్యాధులకు గురికాకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీఎంఆర్ఎం పీహెచ్‌సీ వైద్యుడు రూపశ్రీ అన్నారు. ఫ్రైడే..డ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 4వ వార్డులో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: సీజనల్ వ్యాధులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ బాలరాజు పురపాలిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

పాన్‌గల్: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమిస్తామని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన పార్టీ నాయకులతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు, సెప్టెంబర్ రెండు నెలలు గ్రామాలను సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. అధికారులు స్పందించకపోతే నిరసనలు తెలుపుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో భగత్, జి.వెంకటయ్య, కె.వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వీరారెడ్డి సేవలు మరువ లేనివి

అమరచింత: అమరచింత నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కె.వీరారెడ్డి జయంతిని మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వీరారెడ్డి కుమారుడు నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తిరుమలేష్ , జుబేర్‌అహ్మద్, విష్ణువర్ధన్ యాదవ్, మన్నాన్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: మాజీ ఎమ్మెల్యే కే.వీరారెడ్డి జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం ఇందిరా గాంధీ విగ్రహం వద్ద వీరారెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి గంగాధర్‌గౌడ్, గణేష్‌ముదిరాజ్, పుల్లరిమంజుల, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

నేడు జాబ్ మేళా

ఆత్మకూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేడు జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సైదులు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కళాశాలలో ఉదయం 9:30 గంటలకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వారి ఆధ్వర్యంలో జాబ్‌మేళా కొనసాగుతుందని అన్నారు. 2024–25 విద్యాసంవత్సరంలో ఇంటర్, జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులయిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

గోపాల్‌పేట: అర్హులైన ప్రతిఒక్కరికీ రేషన్‌కార్డులు అందించాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శివ కోరారు. శుక్రవారం తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రేషన్‌కార్డుల్లో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. గత పదేళ్లుగా పేద ప్రజలు ఎంతో ఇబ్బందులకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీతో పాటు నాయకుడు కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

208 రేషన్‌కార్డులు మంజూరు

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు 208 కొత్త రేషన్‌కార్డులు మంజూరైనట్లు శుక్రవారం తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. వీపనగండ్లకు 31, గోవర్ధనగిరికి 25, సంగినేనిపల్లికి 6, తూముకుంటకు 22, సంపత్‌రావుపల్లికి 2, కల్వరాల్లకు 42, పుల్గర్‌చర్లకు 22, గోపల్‌దిన్నెకు 24, కొర్లకుంటకు 2, బొల్లారం 23, వల్లభాపురం గ్రామానికి 9 రేషన్‌కార్డులు మంజూరైనట్లు తెలిపారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాతినిథ్యం కల్పించండి

ఖిల్లాఘనపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని దివ్యాంగుల ప్రాతినిధ్య సాధన కమిటీ నాయకులు శుక్రవారం తహసీల్దార్ సుగుణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ మద్దిలేటి, ఎన్‌పీఆర్‌డీ ఇండియా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, జిల్లా అధ్యక్షుడు అన్నపూర్ణ మాట్లాడుతు గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లతో నామినేటెడ్ సభ్యులుగా దివ్యాంగులకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో శాంత, రామకృష్ణ పాల్గొన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలతో ఎన్నో ప్రయోజనాలు

వీపనగండ్ల: ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహిస్తున్న సమావేశాలు ఉపాధ్యాయులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని ఎంఈఓ నర్సింహ, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం తూముకుంట గ్రామ ఉన్నత పాఠశాలలో సమావేశంలో వారు పాల్గొన్నారు. ప్రతి సమావేశానికి ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ వెంకటేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ

అమరచింత: మొక్కలను నాటి వాటిని సంరక్షించడం మానవ మనుగడతో పాటు జీవకోటి రాశులకు ప్రాణవాయువు లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వర్షాలు అనుకూలిస్తున్నాయని దీంతో లక్ష్య సాధనలో భాగంగా మొక్కలను నాలుగుతున్నామన్నారు. కార్యక్రమంలో మెనేజర్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి

పాన్‌గల్: కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంతో పనిచేస్తూ స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా యువమోర్చా అధ్యక్షుడు భరత్‌చంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని మాందాపూర్ గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు శివరామ్ అధ్యక్షతన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు తీసుకెళ్లాలన్నారు. బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచే విధంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని అసెంబ్లీ కోకన్వీనర్ అన్వేశ్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా దళితమోర్చ అధ్యక్షుడు ప్రవీణ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పుస్తకాలు చదివేలా ప్రోత్సహించండి

పాన్‌గల్: పాఠశాలల్లో ఉండే గ్రంథాలయాల్లో పుస్తకాలు చదివేందుకు విద్యార్థులను ప్రోత్సహించాలని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి, ఎఫ్‌ఎల్‌ఎన్, గ్రంథాలయాల నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. ప్రతి పాఠశాలల్లో టైం టేబుల్‌లో ఖచ్చితంగా గ్రంథాలయం పుస్తకాలు చదివేందుకు ఒక పరియడ్ తప్పక కేటాయించాలన్నారు. మండలంలోని కదిరెపాడు, చిక్కేపల్లి ఉన్నత పాఠశాలలను లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్‌లో తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్పీ శ్రీనివాసులు, ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ప్రజాసమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం



ఆత్మకూర్: ప్రజాసమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలకు ప్రజలు సిద్ధంకావాలని సీపీఐ జిల్లాకార్యదర్శి విజయరాములు అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యాపార దిగ్గజాలకు రాయితీలు, రుణాలు మాఫీచేస్తున్న మోదీ శ్రమజీవులపై భారాన్ని మోపుతున్నారన్నారు.

మూడోసారి జిల్లాకార్యదర్శిగా ఎన్నిక..

సీపీఐ జిల్లా మూడో మహాసభల సందర్భంగా జిల్లా సీపీఐ కార్యదర్శిగా విజయరాములును మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే 19మందిని కౌన్సిల్‌సభ్యులుగా తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, సీఎస్‌శెట్టి, కళావతమ్మ, మోష పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ఖిల్లాఘనపురం: విద్యుదాఘాతంతో ఓ ఎద్దు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్నది. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని హీర్లతండాకు చెందిన పాత్లావత్ సోమ్లానాయక్‌కు చెందిన ఎద్దు శుక్రవారం సాయంత్రం సూర్యతండా సమీపంలో మేతమేస్తుండగా స్తంభం విరిగిపడడంతో విద్యుత్ షాక్ తగిలి ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. స్తంభం శిథిలావస్థకు చేరినట్లు పలుమార్లు విద్యుత్ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఆదుకోవాలని సోమ్లానాయక్ కోరుతున్నాడు.